నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ మంగళవారం 23 ఏప్రిల్ 2024 | ADILABAD NIRMAL




ఆదిలాబాద్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# యూనివర్సిటీ మంజూరు చేస్తాం..

● కుప్టీ ప్రాజెక్టును నిర్మిస్తాం.. ● సీసీఐ ప్రారంభానికి చర్యలు

● కాంగ్రెస్ ప్రచార సభలో సీఎం రేవంత్‌రెడ్డి

ఆదిలాబాద్, ఏప్రిల్ 22(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీని మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో జరిగిన కాంగ్రెస్ ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు వల్ల ఇక్కడి విద్యార్థులకు ఉన్నత చదువులతోపాటు మంచి ఉద్యోగాలు సాధించే అవకాశాలు ఉంటాయన్నారు. బోథ్ నియోజకవర్గంలో రైతుల భూములకు సాగునీరు అందించడానికి కుప్టీ ప్రాజెక్టును నిర్మిస్తామన్నారు. ఆదిలాబాద్ అడవి బిడ్డలు తెల్లదొరలపై పోరాటం చేశారని, వారు పౌరుషానికి నిదర్శనమని పేర్కొన్నారు. జల్, జంగిల్, జమీన్ పేరిట కుమ్రం భీం పోరాడారని ఈ గడ్డ ఎవరికీ తల వంచదని నిరూపించాడన్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం సాక్షిగా అమరుల కుటుంబాలను ఆదుకుని వారికి ఇందిరమ్మ ఇండ్లను అందజేశామన్నారు. ఇంద్రవెల్లి స్తూపాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. నాగోబా జాతరకు కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కట్టిన కడెం ప్రాజెక్టు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా కూలిపోయే పరిస్థితి ఉందని, ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్లక్ష్యం ఫలితంగా ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ తిరిగి ప్రారంభానికి నోచుకోలేదని తెలిపారు. తాము ఎన్ని విజ్ఞప్తులు చేసినా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, కేసీఆర్ పట్టించుకోలేదని తెలిపారు. పదేండ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చక మోసం చేశాయని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలు చేశామని.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, నాయకులు వేణుగోపాలాచారి, కోణప్ప, శ్రీహరిరావు పాల్గొన్నారు.

## ఐదో రోజు మూడు నామినేషన్లు

ఎదులాపురం, ఏప్రిల్ 22 : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో కార్యాలయంలో నామినేషన్ల పత్రాలను అందజేశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఐదో రోజు ఆదిలాబాద్ పట్టణంలోని రణదివ్యనగర్‌కు చెంది మెస్రం గంగాదేవి(స్వతంత్ర), రాథోడ్ సుభాష్ (స్వతంత్ర) అభ్యర్థి తరపున రెండో సెట్ దాఖలు చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆత్రం సుగుణ అభ్యర్థికి సంబంధించిన మూడు నామినేషన్ల పత్రాలను దాఖలు చేశారని జిల్లా రిటర్నింగ్ అధికారి రాజర్షి షా తెలిపారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మూడో సెట్ నామినేషన్‌ను దాఖలు చేస్తున్న మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

## హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 22 : హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ నిర్మల్ అదనపు సేషన్ జడ్జి అజేశ్‌కుమార్ తీర్పు వెల్లడించినట్లు లైజన్ అధికారి సక్రియా నాయక్ తెలిపారు. నిర్మల్ పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన సోనాబాయి, భర్త వాగ్మారే బాపురావు ఇద్దరు ట్రాక్టర్‌పై కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.ట్రాక్టర్ డ్రైవర్ సంతోష్ సోనాబాయి కూలీ డబ్బులను అప్పుడప్పుడూ వాడుకునేవాడు. డబ్బుల కోసం 24 నవంబర్ 2021న సంతోష్‌ను అడుగగా ఆమెను దూషిస్తూ కట్టెతో కొట్టాడు. ఈ విషయాన్ని కూతురు తండ్రికి వివరించింది. సంతోష్‌ను రాత్రి అయింది రేపు అడుగుదామని అన్నాడు. దీంతో ఆమెకు జరిగిన అవమానాన్ని భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణలో భాగంగా పీపీ రమణారావు 11 మందిని కోర్టులో హాజరు పర్చగా నేరం రుజువైంది. దీంతో అదనపు సేషన్ జడ్జి అజేశ్ కుమార్ సంతోష్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు.

## వెజ్ బిర్యానీలో 'బొద్దింక'



వెజ్ బిర్యానీలో బొద్దింక



బిల్లుకట్టిన రశీదు

ఎదులాపురం, ఏప్రిల్ 22 : ఆదిలాబాద్ పట్టణంలోని గణేశ్ సినిమా థియేటర్ సమీపంలో గల ఓ హోటల్‌లో సంజయ్‌నగర్‌కు చెంది సంతోష్ భరణి సోమవారం మధ్యాహ్నం భోజనం వెజ్‌బిర్యానీ ఆర్డర్ ఇచ్చారు. ఈ వెజ్ బిర్యానీలో బొద్దింక, బొద్దింక రెక్కలు వచ్చాయి. దీంతో హోటల్ నిర్వాహకుడికి చెబితే నిర్లక్ష్యంగా మరో వెజ్ బిర్యాని మార్చి ఇస్తామని చెప్పాడు. ప్రశ్నించిన సంతోష్‌ను హోటల్ నిర్వాహకులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆయన ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

## బీఆర్ఎస్‌తోనే సుభిక్షం

### నిర్మల్‌లో బీఆర్ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 22 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని ఆ పార్టీ నిర్మల్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కును ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టణంలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రం ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. పథకాలను సక్రమంగా అమలు పర్చి పేద ప్రజలకు న్యాయం చేయాలన్నారు. కాంగ్రెస్ 100 రోజుల పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధి శూన్యమని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.

## ఇంటింటికీ బీఆర్ఎస్ ప్రచారం

జైనథ్, ఏప్రిల్ 22 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మండలంలోని బాబాపూర్, అకుర్ల గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మార్సెట్టి గోవర్ధన్ మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు చేసిందేమి లేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాసం నర్సింగ్‌రావ్, మాజీ మండల ఉపాధ్యక్షుడు అల్లూరి కల్యాణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వినోద్ యాదవ్, నాయకులు గోవింద్‌రావ్, ప్రభాకర్ పాల్గొన్నారు.



బాలాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ గోవర్ధన్



ఝరి(బి) గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు రమాదేవి

## సక్కును భారీ మెజార్టీతో గెలిపించండి..

తానూర్, ఏప్రిల్ 22 : బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకురాలు పడకంటి రమాదేవి అన్నారు. సోమవారం మండలంలోని ఝరి(బి), వడ్‌ఝరి, బెంబర్ గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో రైతుబంధు, రైతుబీమా సకాలంలో ఇవ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు రైతుబంధు ఇవ్వలేదని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పని చేస్తుందన్నారు. ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



భైంసా : విరిగిపడిన చెట్టు



ముథోల్‌లో కురుస్తున్న వడగండ్ల వర్షం

# గాలివాన బీభత్సం

ఈదురుగాలులు, ఉరుములు మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షం

భైంసా/ఇంద్రవెల్లి/నార్నూర్/ముథోల్/కుభీర్/కుంటాల, ఏప్రిల్ 22 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు పలు చోట్ల వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షం కురియడంతో పంటలకు నష్టం వాటిల్లింది. మామిడి కాయలు, జొన్న, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. వేసవి తాపం, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. కొన్ని చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇంద్రవెల్లి మండలంలోని లాల్‌టేకిడి, హీరాపూర్ గ్రామాల్లో ఇండ్ల పైకప్పులు, రేకులు లేచిపోయాయి. చేతికొచ్చిన మామిడి కాయలు నేలరాలాయి. నార్నూర్ మండలంలోని మాన్కాపూర్‌కు చెందిన మెస్రం ప్రభు పశువుల కొట్టంపై వేప చెట్టు పడడంతో మూగజీవాలకు స్వల్ప గాయాలు అయ్యాయి. ముథోల్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. విద్యుత్‌కు అంతరాయం కలుగగా.. విద్యుత్ శాఖ అధికారులు పనులు చేపట్టారు. కుభీర్ మండలంలో బలమైన గాలులకు చెట్లు విరిగి పడిపోగా.. కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. ఇండ్ల పైకప్పుల రేకులు, గూన ఇండ్లపై కప్పిన పాలిథిన్ కవర్లు గాలికి లేచిపోయాయి. కుంటాల మండలంలో కూడా చిరుజల్లులు పడడంతో ఆరబోసిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పారు. కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న తడిసింది. తీవ్ర నష్టం జరుగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పంటలను పరిశీలించి నష్టపోయిన వారికి పరిహారం వచ్చేలా కృషి చేయాలని కోరుతున్నారు.



ఇంద్రవెల్లి : ఈదురు గాలులతో రాలిన మామిడిని ఏరుతున్న ఆదివాసులు



ముథోల్ : వడగండ్ల వానకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం



సమీక్ష చేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## సీఎంఆర్ బియ్యాన్ని గడువులోగా అందించాలి..

### నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 22 : కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) సరఫరాను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మిల్లర్లు, అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులతో సీఎంఆర్ సరఫరా, లక్ష్యాపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మిల్లింగ్ ప్రారంభించని మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత మిల్లర్లకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. మిల్లుల వారీగా మిల్లింగ్, ధాన్యం నిల్వలపై రిపోర్టును అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మిల్లర్లవారీగా లక్ష్యం, పూర్తి చేసిన సీఎంఆర్ సరఫరా, పెండింగ్‌పై చర్చించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఎస్‌వో నందిత, డీఎం సివిల్ సప్లయ్ అధికారిణి శ్రీకళ పాల్గొన్నారు.

### మౌలిక సదుపాయాలు కల్పించాలి..

నిర్మల్ జిల్లావ్యాప్తంగా అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైన పాఠశాలలు, చేపట్టిన పనులు, జరుగుతున్న పనులు, పూర్తి అయిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జూన్ మొదటి వారంలోపు పనులు పూర్తిచేసి విద్యా సంవత్సరానికి ఆటంకం లేకుండా చూడాలని పేర్కొన్నారు. పనులను రోజు అధికారులు పర్యవేక్షించాలని, ఆదర్శ కమిటీలను భాగస్వాములుగా చేసి పనులు నాణ్యతగా జరిగేటట్లు చూడాలని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, డీఈవో రవీందర్‌రెడ్డి అధికారులు ఉన్నారు. అనంతరం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష చేశారు. కొనుగోళ్లను వేగంగా చేపట్టాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని సూచించారు.

# 'కోడ్' కష్టాలు

ముహూర్తాలు, ఆంక్షలతో నగదు తరలించలేక ఇబ్బందులు

ఖానాపూర్ టౌన్, ఏప్రిల్ 22 : ఈ నెల ఆఖరు తర్వాత మూడాలతో దాదాపు మూడు నెలల వరకు మళ్లీ శుభకార్యాలు లేవు. ప్రస్తుతం ముహూర్తాలు ఉండడంతో చాలా చోట్ల పెళ్లిళ్ల సందడి నెలకున్నది. పెళ్లిల్లే కాకుండా గృహ ప్రవేశాలు, ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపనలు, నూతన ఇంటి నిర్మాణానికి భూమిపూజలతోపాటు ఇతర శుభకార్యాలతో పండుగ వాతావరణం నెలకున్నది. వీటిలో ఏ కార్యం మొదలు పెట్టాలన్నా లక్షల రూపాయలు చేతులు మారాల్సిందే. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్‌తో నగదు లావాదేవీలకు కాష్టాలు వచ్చి పడ్డాయి. రూ. 50 వేల నగదు తరలిస్తే చెక్‌పోస్టుల వద్ద పోలీసులు పట్టుకుంటున్నారు. సరైన ఆధారాలు చూపించకపోతే నగదును సీజ్ చేస్తున్నారు. దీంతో నగదు తరలించాలంటే ఇబ్బంది ఎదురవుతున్నది. శుభకార్యాలు పెట్టుకున్నవారి పరిస్థితి దయనీయంగా మారింది. ఎన్నికల నియమావళి వల్ల శుభకార్యాలకు సామగ్రి సమకూర్చుకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. దీంతో ఇంట్లో శుభకార్యం జరుగుతున్న ఆనందం ఎన్నికల ఆంక్షలతో ఆవిరైపోతున్నదని ప్రజలు వాపోతున్నారు.



చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు(ఫైల్)



పట్టుబడిన నగదు(ఫైల్)

### రూ.50 వేలకు మించితే సీజ్

ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేల కంటే ఎక్కువ నగదు వెంట తీసుకెళ్తే పోలీసులు తనిఖీ చేసి సీజ్ చేస్తున్నారు. దీంతో శుభకార్యాలు చేసేవారు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేవారు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకొస్తే వాటికి ఆధారాలు చూపించాల్సి వస్తున్నది. శుభకార్యాల కోసం సరిపడా సామగ్రిని కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు.

### ఎక్కడికక్కడే చెక్‌పోస్టులు

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలే కాకుండా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. శుభకార్యాల వేళ ఈ తనిఖీలు సామాన్యులను కలవరపెడుతున్నాయి. కట్నకానుకలు, పెళ్లి దుస్తులు, ఫంక్షన్‌హాల్‌ల బుకింగ్, బంగారం కొనుగోళ్లు, పెళ్లింట చేపట్టే పనులకు అడ్వాన్స్‌లు ఇలా ప్రతిదానికి అధిక మొత్తంలో డబ్బులు అవసరమవుతాయి. ఎన్నికల కోడ్ నిబంధనలతో ఆన్‌లైన్ చెల్లింపులు కూడా పెద్ద మొత్తంలో చేయాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు.

### ఎన్నికల నిబంధనలు పాటించాలి..



*నగదు, బంగారం తీసుకెళ్లే సమయంలో తగిన ఆధారాలు ఉంటే అనుమతి ఉంటుంది. అలాగే రూ.50 వేలకు మించి వెంట తీసుకెళ్తే సీజ్ చేస్తాం. తర్వాత ఎన్నికల కమిషన్ నియమించిన కమిటీ విచారించి నిర్ధారించిన తర్వాతనే నగదును విడుదల చేస్తాం. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలి.*

*- సైదరావు, సీఐ, ఖానాపూర్.*

# అభయ హస్తం.. మొండి హస్తం..

● అర్హత ఉన్నా అందని గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు ● కార్యాలయం చుట్టూ తిరిగినా అందని సర్కారు సాయం

● అధికారుల నిర్లక్ష్యం, సాంకేతిక తంటాతో అవస్థలు

*మా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభయ హస్తం పేరిట ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి పగ్గాలు చేపట్టగానే మరిచారు. ఆరు గ్యారెంటీలను తూతూ మంత్రంగా శ్రీకారం చుట్టి వదిలేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అర్హులకు పథకాలు అందకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. అర్హత ఉండి జీరో బిల్లురాని వారు, గ్యాస్ సిలిండర్ రాయితీ బ్యాంక్ ఖాతాలో జమకాని వారు అయోమయం చెందుతున్నారు.*



సిర్గాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా ప్రజాపాలన ప్రత్యేకాధికారి(ఫైల్)

దిలావర్‌పూర్, ఏప్రిల్ 22 : దిలావర్‌పూర్ మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ఊరూరా ప్రజాపాలన కేంద్రాలను అర్భాటంగా ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు. డిసెంబర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి పథకానికి 6,425, గృహజ్యోతి పథకానికి 6,206 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అర్హత ఉన్న సగం మంది లబ్ధిదారులకు కూడా అందడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందని వారు మళ్లీ ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. అయినప్పటికీ ఇంకా పథకాలు రావడం లేదు. దరఖాస్తుదారులు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము దరఖాస్తు చేసుకున్న కంప్యూటరీకరణ చేయడం లేదని అధికారులతో వాగ్వావాదానికి దిగుతున్నారు. ప్రధానంగా పథకాలకు సాంకేతిక సమస్య తంటాగా మారింది. ఎడిట్ అప్షన్ లేక అధికారులు కూడా సమాధానం చెప్పలేక అవస్థలు పడుతున్నారు. సిలిండర్‌కు సంబంధించి పూర్తిస్థాయి ఎడిట్ అప్షన్ లేక పోవడంతో రూ.500 లబ్ధిదారులకు రావడం లేదు.

### బిల్లు కట్టుమని ఇంటికి వస్తుండ్రు..



*నాకు గతంలో నెలకు రూ.150-రూ.200ల వరకు కరెంట్ బిల్లు వచ్చేది. నాకు తెల్లరేషన్ కార్డు కూడా ఉన్నది. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు పెట్టుకున్న. నాకు అన్ని అర్హతలు ఉన్నాయి. కానీ.. నాకు జీరో బిల్లు రావడం లేదు. సిలిండర్ సబ్సిడీ కూడా రావడం లేదు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న. ఈ నెలలో కూడా కరెంటు బిల్లు వచ్చింది. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులను అడిగితే ఎన్నికల కోడ్ ఉన్నదని చెబుతుండ్రు. ఎన్నికల కోడ్ రాక ముందు దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పటికి నా దరఖాస్తు కంప్యూటరీకరణ కాలేదు.*

*- సాజీద్, లోలం, దిలావర్‌పూర్ మండలం.*

### ముక్కుపిండి కరెంట్ బిల్లు తీసుకుంటుండ్రు..



*నాకు తెల్ల రేషన్‌కార్డు ఉన్నది. చిన్న పూరి గుడిసేలో ఉంటున్నా. అయిన నాకు నెల నెల కరెంట్ బిల్లు వస్తున్నది. ఆఫీస్‌కు ఎన్ని సార్లు వెళ్లినా పట్టించుకోవడం లేదు. మా వద్ద నుంచి కరెంట్ బిల్లు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇదేం ప్రభుత్వం. కరెంటు బిల్లు మాఫీ చేస్తామని మళ్లీ కట్టించుకుంటున్నరు. నాలుగు రోజుల క్రితం వెళ్లి రూ.340 కట్టినా.*

*- బిమీలిబాయి, తాండ, దిలావర్‌పూర్ మండలం.*